# విరుష్కకు రెండో సంతానం



ముంబై: టీమ్‌ఇండియా స్టార్ క్రికెట్ విరాట్‌కోహ్లీ, అనుష్కశర్మ దంపతులకు త్వరలో రెండో సంతానం కలుగబోతున్నది. ఈ విషయాన్ని విరాట్ ఆప్తమిత్రుడు దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డివిలీయర్స్ శనివారం వెల్లడించాడు. కోహ్లీ కుటుంబంలోకి కొత్తగా మరొకరు రాబోతున్నారంటూ పేర్కొన్నాడు. వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు కోహ్లీ దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో డివిలీయర్స్ మాట్లాడుతూ 'నాకు తెలిసినంత వరకు కోహ్లీ ప్రస్తుతం బాగానే ఉన్నాడు. అతడు కుటుంబంతో గడుపుతున్న కారణంగా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. రెండో సంతానం కోసం అతను ఎదురుచూస్తున్నాడు. కుటుంబంతో గడిపేందుకు కోహ్లీకి ఇది విలువైన సమయం' అని అన్నాడు.

# రాహుల్, నితీశ్ సెంచరీలు

- **హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 458/8**
- **మిజోరాంతో రంజీ మ్యాచ్**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కెప్టెన్ రాహుల్ సింగ్ (108; 14 ఫోర్లు, 2 సిక్సర్లు), నితీశ్ రెడ్డి (115; 11 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీలతో కదం తొక్కడంతో.. మిజోరాంతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 120/1తో శనివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 458 పరుగులు చేసింది. ప్రజ్ఞయ్ రెడ్డి (91), రోహిత్ రాయుడు (60) అర్ధశతకాలతో రాణించారు. మిజోరాం తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌట్ కాగా.. హైదరాబాద్ జట్టు 259 పరుగుల ఆధిక్యంలో ఉంది. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా ఆడిన గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ బోనస్ పాయింట్ విజయాలు సాధించిన హైదరాబాద్.. ఐదో విజయం దిశగా సాగుతున్నది.

# రన్నరప్ కార్తీక్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంటాల్య (టర్కీ) వేదికగా జరిగిన వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ సాయికార్తీక్ రెడ్డి, సిద్ధాంత్ బంటియా జోడీ రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో కార్తీక్, సిద్ధాంత్ ద్వయం 3-6, 6-3, 8-10తో బోగ్డాన్ పావెల్, డొమినిక్ కెలోవ్‌స్కీ జంట చేతిలో ఓటమిపాలైంది.



# భారత్‌కు ఆధిక్యం

### పాకిస్థాన్‌తో డేవిస్ కప్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌తో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూపు-1 క్వాలిఫయర్స్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆరు దశాబ్దాల తర్వాత పాక్ గడ్డపై అడుగుపెట్టిన భారత టెన్నిస్ బృందం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం జరిగిన తొలి పోరులో రామ్‌కుమార్ రామనాథన్ 6-7, 7-6, 6-0తో ఖురేషి ఇసాముల్‌హక్‌పై విజయం సాధించాడు. మరో పోరులో శ్రీరామ్ బాలాజీ 7-5, 6-3తో అఖిల్‌ఖాన్‌పై గెలిచాడు. ఆదివారం మిగతా మూడు మ్యాచ్‌లు జరుగనున్నాయి.

# శ్రీలంక 410/6

కొలంబో: సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (141; 14 ఫోర్లు, 3 సిక్సర్లు), దినేశ్ చండిమాల్ (107) శతకాలతో రెచ్చిపోవడంతో అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతున్నది. శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి లంక తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 410 పరుగులు చేసింది. మాథ్యూస్, చండిమాల్‌తో పాటు దిముత్ కరుణరత్నె (77) రాణించాడు. అంతకుముందు అఫ్గాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌట్ కాగా.. ప్రస్తుతం లంక 212 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

# బ్యాటింగ్‌లో జై.. బౌలింగ్‌లో జెస్సీ

**యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీ**

**వైజాగ్ టెస్టు**

## ఆరు వికెట్లతో బుమ్రా విజృంభణ

- **భారత్ తొలి ఇన్నింగ్స్ 396**
- **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 253**
- **భారత్ రెండో ఇన్నింగ్స్ 28/0**
- **ఓవరాల్ ఆధిక్యం 171**

**10** టెస్టుల్లో ఐదు వికెట్లు తీయడం బుమ్రాకు ఇది పదోసారి.



బుమ్రా (6/45)

సహచరులంతా విఫలమైన చోట యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్వితీయ బ్యాటింగ్‌తో అదరగొడితే.. బౌలింగ్‌లో ఆ బాధ్యత ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తీసుకున్నాడు. బ్యాట్‌తో జైస్వాల్ డబుల్ సెంచరీ బాదితే.. బంతితో బుమ్రా ఆరు వికెట్లతో ఇంగ్లిష్ టీమ్‌ను అల్లాడించాడు!

జీవం లేని ఫ్లాట్ పిచ్! పేసర్లకు తోడ్పాటు లేదు.. స్పిన్నర్లకు సహకారం లేదు అనుకుంటున్న సమయంలో బంతిని గాల్లోనే రివర్స్ స్వింగ్ చేస్తూ చెలరేగిన బుమ్రా.. ఇంగ్లండ్ వెన్ను విరిచాడు. నభూతో అనదగ్గ బంతితో ఓలీ పోప్ వికెట్లు చెల్లాచెదురు చేసిన బుమ్రా.. ఓ అద్భుత డెలివరీతో బెన్ స్టోక్స్‌ను బోల్తా కొట్టించాడు. దాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియని స్టోక్స్ బ్యాట్ కింద పడేసి.. 'ఏంటీ బాస్ ఇదీ' అన్నట్లు ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ ఒక్కటి చాలు ఈ ఇన్నింగ్స్‌లో జెస్సీ బౌలింగ్ ఎలా సాగిందో చెప్పేందుకు!!

విశాఖపట్నం: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్య పరాజయం ఎదుర్కొన్న టీమ్‌ఇండియా.. రెండో పోరుపై పట్టు బిగించింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని 253 పరుగులకే ఆలౌట్ చేసి మంచి ఆధిక్యం మూటగట్టుకుంది. యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (290 బంతుల్లో 209; 19 ఫోర్లు, 7 సిక్సర్లు) కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 336/6తో శనివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ ఆఖరికి 396 పరుగులకు ఆలౌటైంది. అశ్విన్ (20) కాస్త సహకరించగా.. జైస్వాల్ ద్విశతకం పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. 'బజ్‌బాల్' ఆటతీరుతో 55.5 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. జాక్ క్రాలీ (78 బంతుల్లో 76; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ బెన్ స్టోక్స్ (47) పోరాడాడు. భారత బౌలర్లలో బుమ్రా ఆరు వికెట్లతో అదరగొట్టగా.. కుల్దీప్ 3 వికెట్లు తీశాడు. దీంతో భారత జట్టుకు 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలుపుకొని ఓవరాల్‌గా టీమ్‌ఇండియా 171 పరుగుల ముందుండగా.. జైస్వాల్ (15), రోహిత్ (13) క్రీజులో ఉన్నారు. ఉప్పల్ టెస్టులో భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా.. చివరకు మ్యాచ్ ఓడిన రోహిత్‌సేన.. వైజాగ్‌లో మూడో రోజంతా బ్యాటింగ్ చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తేనే సిరీస్ సమం కానుంది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 396 (జైస్వాల్ 209, గిల్ 34; అండర్సన్ 3/47, రేహాన్ 3/65), **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 253 (క్రాలీ 76, స్టోక్స్ 47; బుమ్రా 6/45, కుల్దీప్ 3/71), **భారత్ రెండో ఇన్నింగ్స్:** 5 ఓవర్లలో 28/0 (జైస్వాల్ 15 నాటౌట్, రోహిత్ 13 నాటౌట్).

## బూమ్ బూమ్ బుమ్రా!

*నిర్జీవ పిచ్‌పై నిప్పులు చెరిగే నైపుణ్యం.. ఫ్లాట్ వికెట్‌పై బంతిని షేక్ చేయగల సత్తా ఉంటే.. భారత గడ్డపై పేసర్లు కూడా వికెట్లు తీయొచ్చని బుమ్రా నిరూపించాడు!*

నేల నుంచి సహకారం లభించకపోతే.. నింగే తనకు హద్దు అన్నట్లు.. గాల్లోనే బంతి నుంచి రివర్స్ స్వింగ్ రాబడుతూ వైజాగ్‌లో బుమ్రా రచించిన విధ్వంసకాండ మాటలకందనిది. ప్రత్యర్థి బ్యాటర్లు పాతుకు పోతున్నారనుకున్న ప్రతిసారి.. సారథి రోహిత్ బంతిని బుమ్రా వైపు విసరడం.. అతడు వచ్చి భాగస్వామ్యాన్ని విడగొట్టడం సాగర తీరాన ఇదే సీన్ రిపీట్ అయింది. ఉప్పల్ టెస్టులో అసమాన పోరాటంతో ఇంగ్లండ్ టీమ్‌కు ఒంటిచేత్తో విజయాన్నందించిన ఓలీ పోప్‌కు బుమ్రా సంధించిన బంతైతే.. ఎంతటి మొనగాడినైనా మోకాళ్లపై కూర్చోబెట్టేదే. ఆడేందుకు కాదు కదా కనీసం అడ్డుకునేందుకు కూడా వీలు లేకుండా.. యార్కర్ అంటే ఎలా ఉంటుందో రుచి చూపిస్తూ.. పోప్ వికెట్లను నేలపాలు చేసిన బుమ్రా.. ఇంగ్లండ్ సారథి స్టోక్స్‌తో సలాం కొట్టించుకున్నాడు. గత మ్యాచ్‌లోనూ స్టోక్స్‌ను దిమ్మతిరిగే బంతితో బౌల్డ్ చేసిన బుమ్రా.. ఈ సారి డోసు మరింత పెంచి ఆశ్చర్యచకితుడిని చేశాడు. సిరాజ్‌కు విశ్రాంతినిచ్చి తుది జట్టులోకి తీసుకున్న మరో పేసర్ ముఖేశ్ కుమార్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్న చోట బుమ్రా తన విలువ చాటుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ జెస్సీ జోరు ఇలాగే కొనసాగితే మ్యాచ్ మన వశమైనట్లే!

**2** వేగంగా 150 వికెట్లు పడగొట్టిన రెండో ఆసియా బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. వకార్ యూనిస్ ముందున్నాడు.

**3** పిన్నవయసు (22 సంవత్సరాల 36 రోజులు)లో డబుల్ సెంచరీ చేసిన మూడో భారత ప్లేయర్‌గా జైస్వాల్ నిలిచాడు. వినోద్ కాంబ్లీ, సునీల్ గవాస్కర్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.



జైస్వాల్ (209)






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.